# మంచివాళ్ళు

జి. రామచంద్రరావు

"ఏమండీ!"

"..............."

"మిమ్మల్నే!!"

"ఊఁ......"

"లేవండీ! ఎవరో పిలుస్తున్నారు మిమ్మల్ని!"

"అబ్బ!" అంటూ పక్కమీంచి బద్ధకంగా లేచాడు మూర్తి. కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి తలుపులు తీసి, వాకిట్లోకి చూశాడు. తలుపవతల కానిస్టేబుల్ యూనిఫాంలో నిల్చొనిఉన్నాడు. గబగబా కళ్ళు నులుముకొని, కనుబొమలు బాగాపైకి పోయేలా మళ్లీ చూశాడు.

"ఏమిటండీ?" అడిగాడు మూర్తి.

"సత్యనారాయణమూర్తిగారు మీరేనా?"

"అవును!"

"మీరోసారి స్టేషన్‌కి రావాలి!"

"నేనా?... నే నేంచేశాను?"

"మీరు కాదు! ఆనందరావుగారనీ మీ స్నేహితులట. బ్రోతల్ కేసులో పట్టుబడ్డారు. మా ఎస్.ఐ. గారు కస్టడీలోకి తీసుకొని లాకప్‌లో ఉంచారు. మీరుండేచోటూ అదీ వివరంగాచెప్పి, ఆనందరావుగారు ఎలాగైనా ఈ కబురు మీకు అందచెయ్యమన్నారు."

మత్తు పూర్తిగా వదిలిపోయింది మూర్తికి. నమ్మలేనట్లుగా పెట్టాడు ముఖం. ఏవేవో సందేహాలొచ్చాయి. కాని, పైకి అడగలేదు.

"ఉండండి! ఇప్పుడే వచ్చేస్తున్నాను" పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ఇంట్లో కొచ్చాడు. బయటంతా మాటుమణిగి ఉందేమో, జానకికూడా అంతా వింది. భర్త లోపలికి రాగానే ఆత్రంగా అడిగింది.


"ఆనందం అన్నయ్యని పోలీసులు పట్టుకెళ్ళడమేమిటండీ?"

"అదే నాకూ అయోమయంగా ఉంది. ఏదో మిస్టేక్ జరిగుంటుందని నా అనుమానం. వెళ్తే అన్నీ తెలుస్తాయిగా" అంటూ పేంటూ, షర్టూ వేసుకొని, వాచీ పెట్టుకొన్నాడు. "జానకీ! పదకొండయ్యింది. నేను మళ్ళీ తిరిగొచ్చేటప్పటికి ఏవేళవుతుందో ఏమో! నాకోసం చూడకుండా పడుకో!" చెప్పు లేసుకొని, ఆటోబైక్ తీసుకొని బయల్దేరాడు మూర్తి.

"మీ రెలా వచ్చారు?"

"రిక్షాలో వచ్చాను."

"అయితే, వెనకాల కూర్చోండి!"



వాతో రమ్మన్నాను వచ్చేసింది. పాపం! అలా వస్తే ఏంచేశాన్నేను! జైలుపాలు చేశాను! తా నొకర్తీ ఊళ్లో తిరిగితే చిక్కుల్లో పడిపోతుందని చెప్పి - నా వెంటబెట్టుకొచ్చి నేనుచేసిన నిర్వాహకం చూశావా? గోతిలో పడేశాను! కేవలం నా మూలంగానే అన్నెమూ పున్నెమూ ఎరుగని ఆ పిల్ల అతి నికృష్టమైన శిక్ష అనుభవిస్తోంది. దీనికంతకూ కారణం నేను! ఒక విధంగా చూస్తే లేనిపోని ఆశలు నేను కల్పించినట్టే! ఎండిపోయిన మోడు మళ్ళీ చిగురించింది. చెయ్యని నేరానికి శిక్ష అనుభవిస్తూన్న పద్మను దాని ఖర్మానికి దాన్ని అలా వదిలేసి చేతులు దులిపేసుకోవడం అన్యాయం కాదా? నన్ను మాత్రమే రక్షించుకొని ఆ పిల్ల విషయం పట్టించుకోకపోవడం న్యాయం కాదుగదా? నా ప్రాణానికిబడి ఒక జీవి దిక్కూ మొక్కూ లేకుండా ఆ జైల్లో మగ్గిపోవడం నేను భరించలేను. ఇది అమానుషం" ఊగిపోతున్నాడు మనిషి. ముఖంనిండా బాధంతా పులుముకొని పోయింది.

ఆనందరావు కోరికీ, అతని స్వభావమూ బాగా తెలిసినవాడైనా, ఇప్పుడు, ఈ విషయంలో అతని నిర్ణయానికీ, ముఖ్యంగా అతని చిత్తశుద్ధికీ మనసులోనే సంతోషిస్తాడు మూర్తి. అయినా పైకి మామూలుగానే అన్నాడు.

"ఎన్నాళ్ళకో బెయిల్‌మీద తీసుకొచ్చాం. కేసు హియరింగు కొచ్చాక ఫైన్ కట్టేస్తే సరిపోతుంది. అది ఓ రకంగా భయం లేదు. కాని, ఆ అమ్మాయిని పెంచేటతని ఏ పెద్దమనిషైనా ఎలా అడగాలో సాధ్యం కావడంలేదు. పైగా ఎంత అప్రతిష్ఠ! అదీగాక- లోకందృష్టిలో ఈ వ్యవహారమంతా నీచమైన పనికిందే లెఖ్ఖ" క్షణం ఆగి తిరిగి మళ్ళీ అడిగాడు.

"ఆ! ...తర్వాతేం జరిగింది? అసలు పోలీసు లక్కడికి ఎలా వచ్చారు?"

ఆనందరావు తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

"తల్లిని దగాచేసిపెళ్ళిపోయిన ఆ మహానుభావుడి ఆచూకీ తరవాత ఎంత ప్రయత్నం చేసినా తెలియలేదని చెప్పింది! వాళ్ళమ్మ బ్రతికుండగా అతని పేరు కూడా ఎప్పుడూ చెప్పినట్టు గుర్తు లేదట. కాని, అతను వాళ్ళమ్మతో కలిసితీయించుకున్న ఫోటో మాత్రం ఇంట్లో వుండేదనీ, ఏనాటికైనా, ఎక్కడైనా తన తండ్రి తటస్థపడితే పోల్చుకోవచ్చుననే ఆశతో ఆ ఫోటో మాత్రం వచ్చేటప్పుడు తన సంచీలో వడేసుకుందిట! సరిగా ఈముక్క చెబుతూ నాకా ఫోటో చూపిస్తానని లేవబోతూండగా పోలీసువాళ్లు రానేవచ్చారు. మేమూ బాపతువాళ్ళం కాదని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. వేన్‌లో ఎక్కించుకుని తీసుకుపోయారు. పోలీసులు అక్కడికి ఎలావచ్చిందీ, ఇది తప్పుగా వారు ఎలా భావించిందీ - నాకూడా అంతుబట్టటంలేదు.

జానకి రెండు గ్లాసుల్లో కాఫీతెచ్చి, మూర్తికీ ఆనందరావుకీ ఇచ్చింది.

"చూశావా [illegible] అన్నయ్య ఎంత రాద్ధాంతం చేశాడో!" కాఫీ అందుకుంటూ అన్నాడు మూర్తి.

"చాల్లెద్దురూ! మీరుకూడా అన్నయ్యనే అంటారు. దిక్కూ మొక్కూలేని ఒక ఆడపిల్లను జాలితలచి ఇంత ఆశ్రయం కల్పించడంలో తప్పేం లేదు. కాకతాళీయంగా ఇంత అనర్థం జరిగిపోతుందని మా అన్నయ్యేమన్నా కలగన్నాడా? ఇంకా మా అన్నయ్య కాబట్టి జరిగిందానికి బాధయినా పడుతున్నాడు. ఇంతకంటే చెయ్యరాని పనులే చేసి, వాళ్ళ ఖర్మానికి వాళ్ళను వదిలేసి నిశ్చింతగా గడిపేయగలగడం అందరికీ చేతకాదులెండి" నవ్వుతోనే అనేసింది జానకి.

"అయితే, మీ అన్నగారి చర్యల్ని వెనకేసుకొస్తున్నావన్నమాట!" చిరుకోపం నటించి అన్నాడు మూర్తి.

"వెనకేసుకురావడమేం ఖర్మ? వున్నమాటే అన్నాను!" ఖాళీ చేసిన గ్లాసులు తీసుకొని వెళ్ళిపోయింది జానకి. ఆనందరావు కూడా వెళ్ళడానికి సిద్ధమై లేచినించున్నాడు.

* * *

"ఉండు నేనుకూడా ఆ వేపొస్తాను. ఆఫీసువేళ కూడా కావస్తూంది" అంటూ మూర్తికూడా లేచాడు. ఈలోగా జానకి కారియర్‌నిండా భోజనం తీసుకొచ్చి అక్కడపెడుతూ అంది.

"కేరియర్ తీసికెళ్ళి పద్మకిచ్చి రండన్నయ్యా"

అనుకోకుండా ఇలా జరిగినందుకు నొచ్చుకున్నాడు ఆనందరావు. "ఎందుకమ్మా! హోటల్నించి తీసికెళ్ళేవాణ్ణికదా, అనవసరంగా శ్రమపడుతున్నావు"

"శ్రమేముందన్నయ్యా. ఈ మాత్రానికి హోటలెందుకు? మరేమీ సంకోచించకుండా ఇకనించీ భోజనం ఇక్కణ్ణించే పట్టుకెళ్ళండి" అంటూ కేరియర్ ఆనందరావు చేతికందించింది జానకి.

ఆ ఇల్లాలి సంస్కారానికి ముగ్ధుడైపోయాడు ఆనందరావు. ఆమెమీద ఎనలేని గౌరవంతో కరిగిపోయాడు. హృదయమంతా బరువెక్కిపోయి మాట్లాడలేక, కేరియర్ పుచ్చుకొని, భారంగా అడుగులేసుకుంటూ ఇవతలకొచ్చేశాడు. వెనకాలే మూర్తికూడా వచ్చి అతన్ని అనుసరించాడు.

* * *

మూర్తికి ఆనందరావుకి స్నేహం ఈనాటిది కాదు. ఒకే వూరు వాళ్ళిద్దరిదీ. ఒకచోటే చిన్నప్పుడు కలిసి చదువుకున్నారు.

మూర్తి వాళ్ళ తల్లిదండ్రులకుఒక్కడే. తండ్రి దశరథరామయ్యగారు. కాస్త శృంగార పురుషుడని ప్రతీతి. సానివాడల పట్టుకొని విచ్చలవిడిగా జీవితం సాగించాడాయన. ఉన్న కాస్త ఆస్తీ ముండలికని, ముతకలకనీ తగలేస్తే ఇహ తరవాతవాళ్ళకి మిగిలేదేమీ ఉండదని భయపడి పెద్దవాళ్లు ఆలోచించి మెల్లగా ఆస్తినంతా మూర్తి తల్లిపేర రాయించేసి ఆయన ఆట కట్టించేశారు.

ఆనందరావుకి మాత్రం వెనకా ముందూ ఎవరూ లేరు. దశరథరామయ్యగారింట్లో తనూ ఒకడుగా అందరికీ తలలో నాలుకలా తిరిగేవాడు. మూర్తి కాలేజీలో చేరడానికి పట్నం వెళ్ళినప్పుడే తను విజయవాడవచ్చేసి ఓ ప్రయివేటు కంపెనీలో చేరి అక్కడే స్థిరపడిపోయాడు.

కాలచక్రం గిర్రున తిరిగిపోయింది. మూర్తి చదువైపోగానే ఓ యింటివాడు కావడమూ విజయవాడలోనే కార్మిక సంక్షేమ కేంద్రానికి ఆర్గనైజరు ఉద్యోగం రావడమూ ఒకదాని తర్వాత ఒకటిగా జరిగిపోయాయి. పట్నంలో కొత్తకాపరం అని వారానికోసారైనా దశరథరామయ్యగారు కొడుకుని కోడల్నీ చూసి వెళ్తున్నారు. ఆనందరావు సలహామీదే ఆఫీసుకి దగ్గరగా ఉండేలా లేబర్ కాలనీకి ఆనుకొని ఉన్న రామరాజు నగరంలో కాపరం పెట్టాడుమూర్తి. ఆనందరావు ఉండేదికూడా కాలనీలోనే కాబట్టి మళ్ళీ చేరువయ్యారు స్నేహితులిద్దరూ.

పద్మ విషయంలో తనపట్ల ఆ దంపతులిద్దరూ ఇంతటి ఆదరం చూపిస్తారని ఆనందరావు అనుకోలేదు. అనివార్యంగా వాళ్ళనికూడా ఈ రొంపిలోకి ఈడ్చవలసి వచ్చిందని బాధపడ్డాడు. కాంతారావుపెళ్ళికి నంద్యాల వెళ్ళకపోయినా ఇంతగొడవ వచ్చేది కాదు. ఇంత మందిని ఇన్ని రకాలుగా ఇబ్బంది పెట్టవలసి వచ్చినందుకు చిరాకు పడిపోయాడు. కాని, పద్మంటే రాను రాను తనకి అభిమానం ఎక్కువైపోతోంది. తనకి తెలీకుండానే ఆమెకు చేరువైపోతున్నాడు. ఏ అవస్థలో ఉన్నా సరే దీనంగా కటకటాల వెనక ఉన్న పద్మమూర్తి ఎప్పుడూ కళ్ళముందు ఆడుతూనేవుంది. దాదాపు తన మనిషిలా ఫీలయ్యాడు. ఆమె విడుదలకోసం ఆరాటపడిపోతూ కాలుగాలిన పిల్లిలా ఉన్నచోట వుండకుండా తిరుగుతూ, జామీను కోసం ఒకరిద్దరు పెద్దవాళ్ళనడిగి భంగపడ్డాడు. "మీ కేమైనా పిచ్చి పట్టిందేమిటయ్యా! ఏదో కుర్రతనం, సరదాగా నాలుగు రోజులు మోజు తీర్చుకున్నావు. అయిపోయింది! అంతేగాని, ఏదో కట్టుకున్న పెళ్ళాం అయినట్టు అలా కాపత్రయ పడిపోతావేమిటి?" అన్నారు తన ముఖం మీద.

ఇదమిద్ధమని తేల్చుకోలేని తన ఆలోచనలకు మనోహరమైన రూపు ఏర్పడినట్టయింది ఆనందరావుకి. అవును! తను కట్టుకుంటే పద్మ తన పెళ్ళాం ఎందుకు కాకూడదు? ఈమాటే అన్నాడు మూర్తితో.

"బాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చావా?" అన్నాడు మూర్తి.

"ఆ: ఆలోచించాను. నాకుమాత్రం ఎవరున్నారు? మీరుతప్ప! ఏనాటికైనా గంతకుతగ్గ బొంత ఒకటి అమరాలికదా! నా కాయశక్తులా శ్రమించి. ఉన్నంతలో పద్మని సుఖపెట్టగలననే నా విశ్వాసం. ఆమెకా ఎవరూలేరు, నేనూ అంతే కదా! మా యిద్దరికీ బాగానే సరిపోయిందనుకొంటా. ఇహ ఆవిణ్ణి కనుక్కోవడమే తరవాయి. ఆ పని నువ్వేచెయ్యాలి" అన్నాడు ఆనందరావు.

* * *

లాయరు సలహాతో అప్పీల్ చేసి పద్మని తీసుకొచ్చారు. నిన్నటివరకూ జరిగింది చాలంటూ పద్మని తమ ఇంట్లోనే ఉంచమన్నది జానకి. ఆ యింట్లో వాతావరణం చూస్తూంటే మరో లోకంలో తిరుగుతున్నట్టుగా ఉంది పద్మకి. తన నిక్కడకు తీసుకురాగానే జానకి స్వయంగా ఎదురొచ్చి తను

